# ఎ పర్ఫెక్ట్ డే ఫర్ బనానాఫిష్

జె.డి. శాలింజర్

అనువాదం: ఎ.వి. రమణమూర్తి

న్యూయార్క్ నుంచి వచ్చి ఆ హోటల్లో ఉంటున్న తొంభై ఏడు మంది ఎడ్వర్టైజింగ్ రంగం వాళ్లు, దూరప్రాంతాలకి కాల్స్ చేయడానికి అక్కడి లైన్లన్నీ ఎలా ఆక్రమించారంటే, రూమ్ నంబర్ 507లో ఉంటున్న ఆ అమ్మాయి తన కాల్ కనెక్ట్ కావడానికి మధ్యాహ్నం నుంచి దాదాపు రెండున్నర వరకూ వేచివుండాల్సి వచ్చింది. కాకపోతే ఈ సమయాన్ని ఆ అమ్మాయి బానే వాడుకుంది. 'సెక్స్ ఈజ్ ఫన్– ఆర్ హెల్' అనే ఒక విమెన్స్ మాగజీన్ నుంచి ఒక ఆర్టికల్ చదివింది. తన దువ్వెనా, బ్రష్ శుభ్రం చేసుకుంది. తన సూట్ మీద పడిన ఒక మరకని శుభ్రం చేసుకుంది. బ్లౌజ్ మీద ఒక బటన్‌ని సరిచేసుకుంది. పుట్టుమచ్చ మీద తలెత్తుతున్న రోమద్వయాన్ని పీకేసింది. టెలిఫోన్ ఆపరేటర్ కాల్ చేసే సమయానికి కిటికీ దగ్గర కూచుని తన ఎడమచేతి గోళ్లకి రంగు వేసుకోవడం దాదాపు పూర్తిచేసింది.

టెలిఫోన్ మోగినంత మాత్రాన ఉలిక్కిపడే రకం కాదు ఆ అమ్మాయి. యుక్తవయస్సు వచ్చిన దగ్గర్నుంచీ ఆ అమ్మాయి ఫోన్ బహుశా నిరంతరంగా అలా మోగుతూనే ఉందేమో అన్నట్టు కనిపిస్తుంది.

ఆ ఫోన్ మోగుతున్నప్పుడు చిటికెన వేలు గోరుకి రంగు వేసుకుంటూన్న ఆమె గీస్తున్న గీతని పూర్తిచేసి, నెయిల్ పాలిష్ బాటిల్ కి మూత పెట్టేసి లేచి నుంచుని, ఇంకా పూర్తిగా ఆరని ఎడమచేతిని గాల్లో అలా అలా ఊపింది. పొడిగా ఉన్న కుడిచేత్తో యాష్ట్రేని తీసుకుని, ఫోన్ ఉన్న నైట్ టేబుల్ దగ్గరకు పట్టుకెళ్లింది. రెండు సింగిల్ కాట్స్‌ని కలిపి ఒకటిగా చేసిన డబుల్ కాట్ మీద కూర్చుంది. అప్పటికి అయిదోదో, ఆరోదో రింగ్– ఫోనెత్తింది.

"హలో," అంది తన తెల్లటి సిల్క్ గౌన్‌కి ఎడంగా ఎడమచేతిని చాచుకుని. కాళ్లకి చెప్పులు తప్పించి ప్రస్తుతం ఆమె వేసుకున్నది అంతే. చెవి రింగులు బాత్‌రూమ్‌లో ఉన్నాయి.

"మీ న్యూ యార్క్ కాల్, మిసెస్ గ్లాస్," అన్నాడు ఆపరేటర్.

"థాంక్యూ," అంది ఆమె– ముందున్న నైట్ టేబుల్ మీద యాష్ట్రేకి చోటు చేస్తూ.

ఫోన్‌లోకి ఒక మహిళ వచ్చింది. "మ్యురియల్? నువ్వేనా?"

ఆమె ఫోన్ రిసీవర్‌ని చెవికి కొంచెం ఎడంగా పెట్టుకుంది. "అవును, అమ్మా. ఎలా ఉన్నావు?" అంది.

"నీ గురించే దిగులుగా ఉంది. ఫోనెందుకు చేయలేదు? బానే ఉన్నావు కదా?"

"నిన్న రాత్రి, అంతకుముందు రాత్రి కూడా నీకు ఫోన్ చేయాలని ప్రయత్నించాను. ఇక్కడ ఫోన్——"

"నువ్వు బానే ఉన్నావు కదా, మ్యురియల్?"

ఆమె ఫోన్‌ని చెవికి ఇంకొంచెం ఎడంగా పెట్టుకుంది. "బానే ఉన్నాను. ఇక్కడ చాలా వేడిగా ఉంది. ఫ్లోరిడాలో ఇప్పటివరకూ ఇదే ఎక్కువ వేడి ఉన్న రోజని——"

"ఫోనెందుకు చేయలేదు? నాకు బెంగగా——"

"అమ్మా, డార్లింగ్ తల్లీ, అరవొద్దు. నాకు చక్కగా వినిపిస్తోంది," అంది ఆమె. "రాత్రి రెండుసార్లు కాల్ చేసాను. ఒకసారి——"

"నువ్వు కాల్ చేయొచ్చని మీ నాన్నకి చెప్పాను. కానీ, ఆయనేమో—— అది సరే, నువ్వు బాగానే ఉన్నావు కదా, మ్యురియల్? నిజం చెప్పు."

"బ్రహ్మాండంగా ఉన్నాను. పదే పదే అడగొద్దు, ప్లీజ్."

"ఎప్పుడు చేరుకున్నారు అక్కడికి?"

"ఊ... బుధవారం పొద్దుటికి."

"ఎవరు డ్రైవ్ చేసారు?"

"తనే," అంది ఆమె. "కంగారు పడకు. చక్కగా డ్రైవ్ చేసాడు. నాకే ఆశ్చర్యం వేసింది."

"అతను డ్రైవ్ చేసాడా? మ్యురియల్, నువ్వు నాకు మాట ఇ——"

"అమ్మా, చెప్పానుగా," అంది ఆమె. "చాలా చక్కగా డ్రైవ్ చేసాడు. యాభై స్పీడు దాటలేదు అస్సలు."

"చెట్ల మీద ఆ తమాషా ప్రయోగాలు ఏమైనా చేసాడా?"

"అబ్బా, చక్కగా డ్రైవ్ చేసాడంటున్నాగా అమ్మా. డ్రైవింగ్ చేసేటప్పుడు వైట్ లైన్‌కి దగ్గరగా ఉండమని చెప్పాను. నేను చెప్పింది అర్థం చేసుకుని, అలానే చేసాడు అతను. అసలు చెట్లవైపు చూసే ప్రయత్నం కూడా చేయలేదు. అన్నట్టు, డాడీ ఆ కారుని బాగుచేయించాడా?"

"ఇంకా లేదు. నాలుగు వందల డాలర్లు అడుగుతున్నారు, కేవలం——"

"అమ్మా, సీమోర్ ఆ డబ్బులేవో తనే ఇస్తానని డాడీతో అన్నాడు. ఊరికే——"

"సరే, చూద్దాం. అతని ప్రవర్తన ఎలా ఉంది—— కారులో గానీ, మిగతా సమయంలో కానీ?"

"బానే వుంది," అందామె.

"నిన్ను ఇంకా అలానే పిలుస్తున్నాడా, ఆ——"

"లేదు, ఇప్పుడు ఇంకోటి, కొత్తది."

"ఏంటీ?"

"అమ్మా, ఏదైతే ఏమిటి?"

"మ్యురియల్, నాకు తెలియాలి. మీ నాన్న——"

"ఓకే, ఓకే. ఇప్పుడు నన్ను మిస్ ఆధ్యాత్మికాన్వేషి 1948 అంటాడు," అంది ఆ అమ్మాయి. అని, కిలకిలా నవ్వింది.

"అదేమీ పెద్ద ఫన్నీగా లేదు, మ్యురియల్. అస్సలు లేదు. దరిద్రంగా ఉంది. బాధాకరంగా ఉంది. అసలు నేను——"

"అమ్మా," మధ్యలో అడ్డుతగిలిందా అమ్మాయి. "చెప్పేది విను. అతను జర్మనీ నుంచి నాకు పంపించిన పుస్తకం గుర్తుందా? ఆ జర్మన్ కవితలూ అవీ ఉంటాయే, అదీ. అది నేను ఏం చేసాను? బుర్ర బద్దలు కొట్టుకుంటున్నా గుర్తు——"

"నీ దగ్గరుంది అది."

"నీకు కచ్చితంగా తెలుసా?"

"కచ్చితంగా. అంటే, అది నాదగ్గరుంది– ఫ్రెడ్డీ రూమ్‌లో. నువ్వు దాన్నిక్కడ వదిలేసావు, తీసి పెట్టడానికి నాకు——ఏం, అతనికి అది కావాలటనా?"

"లేదు, దానిగురించి అడిగాడు మేము డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు. నేను చదివానా లేదా అని అడిగాడు."

"అది జర్మన్ భాషలో ఉంది!"

"అవును కానీ, పెద్ద తేడా ఏం రాదు," అంది ఆ అమ్మాయి కాలిమీద కాలేసుకుంటూ. "ఆ కవితలన్నీ ఈ శతాబ్దపు ఏకైక మహాకవి రాసినవని అతనన్నాడు. ఏదైనా అనువాదం కొనుక్కుని ఉండాల్సిందన్నాడు. లేదూ, వీలైతే అసలు ఆ భాషే నేర్చుకోవాల్సింది అన్నాడు."

"దారుణం, దారుణం. నిజానికి చాలా బాధాకరం. రాత్రి మీ నాన్న అంటాడూ——"

"ఒక్క క్షణం ఆగమ్మా," అంది ఆ అమ్మాయి. కిటికీ దగ్గరికెళ్లి, సిగరెట్టొకటి తీసుకుని వెలిగించుకొని, మళ్లీ మంచం మీద తన చోటుకి తిరిగొచ్చింది. "ఆ, చెప్పమ్మా," అంది.

"మ్యురియల్, ఇప్పుడు చెప్పేది జాగ్రత్తగా విను."

"వింటున్నా."

"మీ నాన్న డాక్టర్ సివెట్‌స్కీతో మాట్లాడారు."

"ఓ?" అందా అమ్మాయి.

"ఆయనకి విషయం మొత్తం చెప్పేసారు. చివరికి– మీ నాన్న సంగతి తెలుసుగా– చెట్ల సంగతి, ఆ కిటికీ

సంగతి కూడా. మీ నానమ్మతో పైకిపోయే ప్లాన్స్ ఏమీ లేవా అని అతను అడిగిన సంగతితో సహా. బెర్మూడా నించి తెచ్చిన ఆ చిత్రాలకి అతను పట్టించిన గతీ– అన్నీ."

"ఊ, తర్వాత?"

"అస్సలు, మొట్టమొదటగా, ఆర్మీవాళ్లు అతన్ని హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేయడమే అసలైన నేరం అన్నాడు. సీమోర్ తన మీద తను పూర్తి కంట్రోల్ కోల్పోవడానికే అవకాశం– చాలా ఎక్కువ అవకాశం, అన్నాడు– ఉందని ఆయన కచ్చితంగా అన్నట్టుగా తెలుస్తోంది."

"ఇక్కడ మేము ఉంటున్న హోటల్లో ఒక సైకైయాట్రిస్ట్ ఉన్నాడు," అంది ఆ అమ్మాయి.

"ఎవరు? పేరేంటి"

"తెలియదు. రైజర్ అనుకుంటాను. మంచి డాక్టరని పేరుందట."

"ఇంతవరకూ ఆ పేరు వినలేదు."

"మంచి డాక్టరేట."

"మ్యురియల్, ఇప్పుడు మళ్లీ అన్నీ మొదలెట్టొద్దు. మీ గురించే మా బాధంతా. నిన్న రాత్రి మీ నాన్న మీకు టెలిగ్రాం ఇద్దామనుకున్నారు ఇంటికి రమ్మని నిజా——"

"ఇప్పుడు ఇంటికి రావడం లేదులే అమ్మా, దానిగురించి మర్చిపో."

"మ్యురియల్, చెప్పేది విను. డాక్టర్ సివేట్స్కీ చెప్పేదాన్ని బట్టి సీమోర్ తన మీద తను పూర్తి కంట్రోల్ కోల్పోవ——"

"ఇప్పుడే కదమ్మా ఇక్కడికి వచ్చింది. పైగా ఇదే మొదటిసారి మేము రావడం. ఇప్పటికిప్పుడు అన్నీ సర్దేసుకుని ఇంటికి నేనైతే చస్తే రాను," అంది అమ్మాయి. "పైగా సన్‌బర్న్‌తో చర్మం కమిలిపోయి ఉంది. ఎక్కడికీ కదిలేట్టు లేదు పరిస్థితి."

"అవునా, ఎక్కువ సన్‌బర్న్ అయిందా? నేనిచ్చిన మందు వాడలేదా? ఆ సీసాని——"

"వాడాను. అయినా అయింది."

"దారుణం. ఎక్కడెక్కడ కాలినట్టు అయింది?"

"మొత్తం తల్లీ, మొత్తం."

"దారుణం."

"ప్రాణానికేమీ ప్రమాదం లేదులే."

"సరే, చెప్పు. ఆ సైకైయాట్రిస్ట్‌తో మాట్లాడావా?"

"ఊ. కొద్దిగా మాట్లాడినట్టే లెక్క."

"ఏమంటాడాయన? నువ్వు మాట్లాడుతున్నప్పుడు సీమోర్ ఎక్కడున్నాడు?"

"పక్కనే ఇంకో రూమ్‌లో కూర్చుని పియానో వాయిస్తున్నాడు. ఇక్కడ మేము ఉన్న రెండు రాత్రుళ్లూ పియానో వాయిస్తూనే ఉన్నాడు."

"సరే, ఆయనేమంటాడు?"

"పెద్దేం లేదు. ముందు నాతో మాట్లాడాడు. నిన్న రాత్రి బింగో గేమ్ ఆడుతున్నప్పుడు ఆ సైకైయాట్రిస్ట్ పక్కనే కూర్చుని ఉన్నాను. అక్కడ పియానో వాయిస్తున్నది మీ ఆయనే కదా అని అడిగాడు. అవును, ఆయనే మా ఆయన అన్నాను. అప్పుడు ఆయన సీమోర్ గానీ సిక్‌గా ఉన్నాడా ఏమిటి కథా అని అడిగాడు. నేనన్నానూ——"

"ఆయన ఎందుకలా అడిగాడు?"

"నాకు తెలియదమ్మా. బహుశా మనిషి కొంచెం పాలిపోయి కనిపించడం వల్ల కావొచ్చు." అందా అమ్మాయి. "సరే, బింగో ఆడటం అయిపోయాక, ఆయనా ఆయన భార్యా వాళ్లతో కలిసి డ్రింక్స్ తీసుకోమని అడిగారు. సరే అన్నాను. ఆయన భార్య ఒక ఘోరమైన మనిషి. మనం బాన్‌విట్ స్టోర్స్ విండోలో ఒక భయంకరమైన డిన్నర్ డ్రస్ చూసాం గుర్తుందా? నువ్వు అన్నావు చిన్న, చిన్న——"

"ఆ ఆకుపచ్చ రంగుదా?"

"అవును, అదే. సరీగ్గా అదే వేసుకుంది. పైగా ఇంతింత పిర్రలు. సీమోర్ గానీ ఆ సుజాన్ గ్లాస్ కి బంధువా అని అడుగుతూనే ఉంది."

"సరే, ఇంతకీ ఏమంటాడు? డాక్టర్."

"అబ్బే, పెద్దగా ఏమీ లేదు. అంటే, మేము బార్‌లో ఉన్నామన్నమాట. చాలా గొడవ గొడవగా ఉందక్కడ."

"సరే కానీ, నువ్వు——నానమ్మ కుర్చీని అతను ఏం చేసాడో చెప్పావా?"

"లేదమ్మా. పెద్దగా వివరాలు మాట్లాడలేకపోయాను," అందా అమ్మాయి. "బహుశా మళ్లీ మాట్లాడే అవకాశం వస్తుంది. ఆయన రోజు మొత్తం బార్‌లోనే ఉంటాడు."

"అతను ఏవైనా వింతగా ప్రవర్తించే అవకాశం ఉందని ఆయన అనుకుంటున్నట్టుగా ఏమైనా చెప్పారా? నీకేమన్నా జరగొచ్చని. . ."

"అలా ఏం లేదు," అంది ఆ అమ్మాయి. "అసలైనా ఆయనకి మరిన్ని వివరాలు కావాలి. చిన్నతనం ఆ వివరాలూ– ఇట్లాంటి విషయాలన్నీ కావాలి వాళ్లకి. చెప్పానుగా, చాలా కొంచెమే మాట్లాడగలిగాను– అంతా రణగొణ ధ్వని అక్కడ."

"సరే, నీ బ్లూ కోట్ ఎలా ఉంది?"

"బానే వుంది. కొంచెం రిపేర్ చేసాను."

"మీ రూమ్ ఎలా ఉంది?"

"బానే వుంది. జస్ట్ బాగుంది, అంతే. యుద్ధానికి ముందు వచ్చినప్పుడు తీసుకున్న రూమ్ దొరకలేదు," అంది అమ్మాయి. "జనాలే భయంకరంగా ఉన్నారు. డైనింగ్ రూమ్‌లో మన పక్క టేబుల్ దగ్గర కూర్చుని ఉన్నవాళ్లని చూస్తే వాళ్లంతా ఏ ట్రక్కుల్లోనో పడి ప్రయాణం చేసి వచ్చినవాళ్లలాగా కనిపిస్తారు."

"ఏం చెప్తాం. అంతటా అలానే ఉంది. నీ బాలే డ్రస్ ఎలా ఉంది?"

"చాలా పొడుగ్గా ఉంది. చెప్పాగా, చాలా పొడుగ్గా ఉంది."

"మ్యురియల్, మళ్లీ మళ్లీ అడగను కానీ– నువ్వు బానే ఉన్నావా?"

"ఎస్, అమ్మా. తొంభయ్యోసారి చెప్తున్నాను. బానే ఉన్నాను."

"ఇంటికి రాదల్చుకోలేదా?"

"లేదమ్మా."

"అసలు నిన్న రాత్రి మీ నాన్న అంటున్నారు. నువ్వెక్కడికైనా కొంతకాలం పాటు ఒక్కదానివే వెళ్లి ఆలోచించుకోదలచుకుంటే, ఆ ఖర్చంతా ఆయనే పెట్టుకుంటానని. మంచి క్రూజ్ ఏదైనా తీసుకోవచ్చు నువ్వు. అసలు ఇద్దరం కలిసి ఏం అనుకున్నామూ అంటే——"

"నో, థాంక్స్," కాలిమీద కాలుని తీసేస్తూ అంది ఆ అమ్మాయి. "అమ్మా, ఈ కాల్ ఖర్చు పెరి——"

"అసలు ఆ యుద్ధం జరుగుతున్నన్ని రోజులూ నువ్వు అతనికోసం ఎలా ఎదురుచూసావో ఆలోచిస్తుంటే– అంటే, అలా ఎదురుచూస్తూ ఉండే పాపం అలాంటి పిచ్చి భార్యల గురించి ఆలోచిస్తే——"

"అమ్మోయ్," అంది అమ్మాయి. "ఇక ఈ కాల్ ఆపేద్దాం. సీమోర్ ఇప్పుడు ఏ క్షణాన్నైనా రావొచ్చు."

"ఎక్కడున్నాడు ఇప్పుడు?"

"బీచ్‌లో."

"బీచ్‌లోనా? ఒక్కడేనా? సరీగ్గా ఉంటాడా అక్కడ?"

"అమ్మా," అంది అమ్మాయి. "నువ్వు అతనేదో పిచ్చి పట్టి తిరుగుతున్న ఉన్మాది అన్నట్టు మాట్లా——"

"నేను అలా ఏం అనలేదు, మ్యురియల్."

"కానీ, నువ్వు అనేది అలా ధ్వనిస్తోంది. నేననేది ఏంటంటే, పాపం అక్కడతను అలా జస్ట్ పడుకుని ఉంటాడు. కనీసం బాత్‌రోబ్ కూడా విప్పడు."

"బాత్‌రోబ్ విప్పడా? ఏం, ఎందుకలా?"

"అబ్బా, నాకు తెలీదమ్మా. బహుశా ఒళ్లు కొంచెం పాలిపోయి ఉండటం వల్ల కావొచ్చు."

"మై గుడ్‌నెస్, అతనికి ఎండ తగలాలి. నువ్వు చెప్పలేవా?"

"సీమోర్ సంగతి నీకు తెలుసు కదా," అంది మళ్లీ కాలిమీద కాలేసుకుంటూ. "అతని టాటూ వైపు మూర్ఖపు జనాలంతా కలిసి వింతగా చూడటం తనకి ఇష్టం లేదంటాడు."

"అసలతనికి టాటూ లేదు కదా! ఆర్మీలో ఉన్నప్పుడు వేయించుకున్నాడా?"

"అమ్మా, కాదు తల్లీ," అంది ఆ అమ్మాయి లేచి నిల్చుంటూ. "సరే, నేను రేపు కాల్ చేస్తాలే, వీలైతే."

"మ్యురియల్, నేను చెప్పేది విను."

"చెప్పమ్మా," అంది తన భారాన్నంతా కుడికాలి మీదకి బదిలీ చేస్తూ.

"అతను ఏదైనా వింతగా చేసినా, మాట్లాడినా తక్షణమే నాకు కాల్ చేయి. నేను చెప్పేది అర్థమైంది కదా? వినిపిస్తోందా?"

"అమ్మా, సీమోర్ అంటే నాకేమీ భయం లేదు."

"మ్యురియల్, నేను చెప్పినట్టు చేస్తానని ప్రామిస్ చేయి."

"ఓకే, ప్రామిస్. గుడ్‌బై అమ్మా," అంది. "నాన్నని అడిగానని చెప్పు." ఫోన్ పెట్టేసింది.

•

"సీ మోర్ గ్లాస్," అంది అదే హోటల్లో వాళ్ల అమ్మతో ఉంటున్న సిబిల్ కార్పెంటర్. "డిడ్ యు సీ మోర్ గ్లాస్?"

*['సీమోర్ గ్లాస్' అనే పేరు మీద పాప వేస్తున్న శ్లేష అది.]*

"నువ్వు అలా అనడం మానేస్తావా!? విసుగొస్తోంది నాకు. ఉండు, కదలొద్దు."

సిబిల్ భుజాలకీ, వీపుకీ సన్–టాన్ ఆయిల్ రాస్తోంది వాళ్ల అమ్మ మిసెస్ కార్పెంటర్. ఒక పెద్ద బీచ్ బాల్ మీద సముద్రానికి అభిముఖంగా కూర్చుని ఉంది సిబిల్. టూ–పీస్ బేతింగ్ సూట్ వేసుకుని వుంది. నిజానికి ఇంకో పదేళ్ల వరకూ ఆ రెండిట్లో ఒక పీస్ ఆ పాపకి అనవసరం!

"సిబిల్, కదలకుండా కూర్చో"

"డిడ్ యు సీ మోర్ గ్లాస్?" అడిగింది సిబిల్.

"సరే," అని మిసెస్ కార్పెంటర్ నిట్టూర్చింది. సన్–టాన్ ఆయిల్ సీసా మూత పెట్టేసింది. "సరే, ఇప్పుడు పోయి ఆడుకో, పాపా. మమ్మీ వెళ్లి మిసెస్ హబ్బెల్‌తో ఒక డ్రింక్ తీసుకుంటుందన్నమాట. వచ్చేటప్పుడు నీకు ఆలివ్ తీసుకొస్తాను."

ఒక్కసారి బయటపడ్డాక, సిబిల్ బీచ్ వైపు రివ్వున పరిగెత్తింది. కొద్దిసేపట్లోనే, హోటల్ అతిథుల కోసం రిజర్వ్ చేసిన ప్రదేశం దాటుకుని ముందుకి వెళ్లిపోయింది.

ఒక పావు మైలు దూరం నడిచి, మెత్తగా ఉన్న బీచ్ ప్రదేశం చేరుకుంది. అక్కడ వెల్లికలా పడుకుని ఉన్న యువకుడిని చూసి ఆగిపోయింది.

"నీళ్లల్లోకి వెళుతున్నావా, see more glass?" అని అడిగింది.

ఆ యువకుడు కొద్దిగా కదిలి, తన డ్రెస్ అంచులు సరిచూసుకున్నాడు. తిరిగి బొక్కబోర్లా పడుకున్నాడు. ఆ తిరగడంలో కళ్లమీద ఉన్న టవల్ కిందపడిపోతూండగా, కళ్లు చిట్లిస్తూ సిబిల్ వైపు చూసాడు.

"హల్లో, సిబిల్."

"నీళ్లల్లోకి వెళుతున్నావా?"

"నీకోసమే వెయిటింగ్," అన్నాడా యువకుడు. "ఏంటి విశేషాలు?"

“ఏంటీ?” అంది సిబిల్.

“ఏంటి విశేషాలు అని అడుగుతున్నాను. ప్రోగ్రాం ఏమిటి?”

“మా డాడీ రేపు నైరీప్లేన్‌లో వస్తున్నాడు,” అంది కాళ్లతో ఇసకని తంతూ.

“జాగ్రత్త, నా కళ్లల్లో పడుతుంది, బేబీ,” అన్నాడు ఆ యువకుడు ఆ పాప చీలమండ మీద చేయివేస్తూ.

“మీ లేడీ ఎక్కడ?” సిబిల్ అడిగింది.

“లేడీ?” తలకి అంటుకున్న ఇసకని కొద్దిగా దులుపుకున్నాడు ఆ యువకుడు. “అది చెప్పటం కష్టం, సిబిల్. వెయ్యిచోట్లల్లో ఎక్కడైనా ఉండొచ్చు ఆమె. జుట్టుకి రంగు వేయించుకుంటూ హెయిర్‌డ్రెస్సర్ దగ్గర ఉండొచ్చు. పేదపిల్లలకి ఏ బొమ్మలో చేస్తూ రూమ్‌లోనే ఉండొచ్చు.” రెండు పిడికిళ్లూ ఒకదానిమీద ఒకటి పెట్టుకుని, గడ్డం ఆ ఎత్తులో పెట్టుకున్నాడు. “ఇంకేదైనా అడుగు, సిబిల్,” అన్నాడు. “నీ బేతింగ్ సూట్ బాగుంది. ఆ నీలం రంగు నాకు నచ్చింది.”

సిబిల్ అతన్ని తేరిపారా చూసింది. తరవాత, తనకేసి చూసుకుంది. “ఇది పసుపుపచ్చ రంగు,” అంది. “ఇది పసుపుపచ్చ రంగు,” అంది మళ్లీ.

“అవునా? కొంచెం దగ్గరకి రా.”

సిబిల్ ఒక్క అడుగు ముందుకేసింది.

“నువ్వు కరెక్టే. ఎంత మూర్ఖపు వెధవని నేను!”

“నీళ్లల్లోకి వెళుతున్నావా?” సిబిల్ అడిగింది.

“ఆలోచిస్తున్నాను. దాని గురించే ఆలోచిస్తున్నాను, సిబిల్.”

ఆ యువకుడు ఉపయోగించే రబ్బర్ ఫ్లోట్‌ని తట్టి చూసింది సిబిల్. “దీనికి గాలి కొట్టాలి,” అంది.

“కరెక్ట్. ఇంకొంచెం కావాలి.” గడ్డం కింద పిడికిళ్లు తీసేసి, గడ్డాన్ని ఇసకలో పెట్టుకున్నాడు. “సిబిల్, ఉత్సాహంగా ఉన్నావు. నిన్ను చూస్తుంటే బాగుంది. నీ గురించి ఏదైనా చెప్పు,” అన్నాడు. కొద్దిగా ముందుకు సాగి, ఆ పాప చీలమండలు రెండూ పట్టుకున్నాడు. “నాది మకరరాశి. నీదేమిటి?” అని అడిగాడు.

“షారోన్ లిప్‌షజ్ చెప్పింది, నువ్వు పియానో సీట్ మీద తన పక్కన కూర్చోపెట్టుకున్నావని,” అంది సిబిల్.

“షారోన్ లిప్‌షజ్ అందా?”

సిబిల్ తలవూపింది గట్టిగా.

ఆ అమ్మాయి చీలమండల్ని వదిలేసి, తన చెంపని ముంజేతిమీద ఆన్చుకున్నాడు. “సరే, నీకు తెలుసు కదా, సిబిల్. నేనక్కడ కూర్చుని పియానో వాయిస్తున్నాను. నువ్వేమో ఎక్కడా కనబడలేదు. ఇంతలో ఆ షారోన్ లిప్‌షజ్ వచ్చి పక్కన కూర్చుంది. కూర్చున్న అమ్మాయిని నెట్టేయలేం కదా?”

“అవును.”

“కదా! అప్పుడు నేనేం చేసానో చెబుతాను.”

“ఏంటది?”

“అక్కడ కూర్చుంది నువ్వే అన్నట్టు ఊహించుకున్నాను.”

సిబిల్ ముందుకి వంగి ఇసకలో తవ్వడం మొదలుపెట్టింది. “నీళ్లల్లోకి వెళదాం,” అంది.

“ఓకే. అలానే చేద్దాం.”

“ఈసారి తనని నెట్టేసెయ్,” అంది సిబిల్.

“ఎవర్ని నెట్టేది?”

“షారోన్ లిప్‌షజ్‌ని.”

“ఓ, షారోన్ లిప్‌షజ్‌నా? తమాషా పేరు. ఏదో జ్ఞాపకమూ, కోరికా కలగలసినట్టుంటుంది,” అన్నాడు. వెంటనే లేచి నిలుచున్నాడు. సముద్రం వైపు చూసాడు. “సిబిల్, ఇప్పుడు మనమేం చేద్దామంటే, ఒక బనానాఫిష్‌ని పట్టుకోవడానికి ప్రయత్నిద్దాం.”

“ఒక– ఏంటది?”

"బనానాఫిష్," అంటూ, తన రోబ్‌కి ఉన్న బెల్ట్ విప్పదీసాడు. బాత్‌రోబ్ కూడా తీసేసాడు. భుజాలు తెల్లగా, సన్నగా ఉన్నాయి. లోపల షార్ట్స్ నీలం రంగులో ఉన్నాయి. రోబ్‌ని ముందు నిలువుగా మడతపెట్టి, తర్వాత దాన్ని మూడు మడతలు పెట్టాడు. అంతకుముందు తన కళ్లమీద పెట్టుకుని ఉన్న టవల్‌ని ఇసకమీద పరచి, దానిమీద ఆ మడతపెట్టిన రోబ్‌ని ఉంచాడు. ఫ్లోట్ తీసుకుని కుడి చంక కింద పెట్టుకున్నాడు. ఎడమచేత్తో సిబిల్ చేయి పట్టుకున్నాడు.

ఇద్దరూ సముద్రం వైపు నడవడం ప్రారంభించారు.

"నువ్విప్పటికే కొన్ని బనానాఫిష్‌లు చూసుంటావు కదా," అన్నాడు.

లేదన్నట్టు సిబిల్ తల అడ్డంగా ఊపింది.

"చూడలేదా? అసలు మీరుండేది ఏ ఊళ్లో?"

"తెలీదు," అంది సిబిల్.

"నీకు తెలిసే ఉంటుంది. అయినా, అసలు తెలుసుకోవాలి. షారోన్ లిప్‌షజ్‌కి మూడున్నర ఏళ్లే కానీ, వాళ్లు ఎక్కడ ఉంటారో తనకి తెలుసు."

సిబిల్ నడవడం ఆపేసి, తన చేతిని అతన్నుంచి గుంజుకుంది. ఒక మామూలు గవ్వని తీసుకుని దాన్ని తీవ్రంగా పరిశీలించడం మొదలుపెట్టింది. తర్వాత దాన్ని కిందపడేసింది. "వర్లీ వుడ్, కనెక్టికట్," అని నడవడం మొదలెట్టింది.

"వర్లీ వుడ్, కనెక్టికట్," అన్నాడు. "అది వర్లీ వుడ్, కనెక్టికట్‌కి దగ్గరా?" అని అడిగాడు.

సిబిల్ అతనివైపు చూసింది. "నేనుండేదే అక్కడ," అంది అసహనంగా. "నేనుండేది వర్లీ వుడ్, కనెక్టికట్‌లో." కొంచెం ముందుకి పరిగెత్తుకుంటూ వెళ్లింది. ఎడమచేత్తో ఎడమపాదాన్ని పట్టుకుని కొంతదూరం గెంతుకుంటూ వెళ్లింది.

"రైట్. ఇప్పుడంతా స్పష్టంగా ఉంది," అన్నాడు ఆ యువకుడు.

సిబిల్ పట్టుకుని ఉన్న తన పాదాన్ని వదిలేసింది. "నువ్వు 'లిటిల్ బ్లాక్ శాంబో' చదివావా?" అని అడిగింది.

"చాలా తమాషాగా ఉందే నువ్వది అడగటం," అన్నాడు. "సరీగ్గా నిన్న రాత్రే దాన్ని చదవడం పూర్తిచేసాను," అన్నాడు. కిందకి వంగి, సిబిల్ చేయి పట్టుకున్నాడు. "ఎలా ఉంది ఆ పుస్తకం?" అని అడిగాడు.

"పులులు నిజంగానే ఆ చెట్టు చుట్టూ తిరిగాయా?"

"అవును. అలా తిరుగుతూనే ఉంటాయేమో, ఇహ తిరగడం ఆపవేమో అనుకున్నాను. అన్ని పులుల్ని నేనెక్కడా చూడలేదు."

"అక్కడ ఆరు మాత్రమే ఉన్నాయి," అంది సిబిల్.

"ఆరు మాత్రమేనా!" అన్నాడు. "దాన్ని మాత్రమే అంటావా?"

"వాక్స్ అంటే నీకు ఇష్టమేనా?" సిబిల్ అడిగింది.

"ఏంటదీ?" అడిగాడు.

"వాక్స్."

"చాలా. నీకు?"

సిబిల్ తలూపింది. "నీకు ఆలివ్స్ ఇష్టమా?" అని అడిగింది.

"ఆలివ్స్—యెస్. ఆలివ్స్, వాక్స్. అసలు అవి లేకుండా నేను ఎక్కడికీ వెళ్లను."

"షారోన్ లిప్‌షజ్ అంటే నీకిష్టమా?" సిబిల్ అడిగింది.

"అవును. అవును, ఇష్టమే," అన్నాడు. "తనలో నాకు ప్రత్యేకంగా నచ్చేదేంటంటే హోటల్ లాబీలో ఉన్న చిన్నచిన్న కుక్కపిల్లల్ని ఏమీ చేయదు. నువ్వు నమ్మవు గానీ, కొంతమంది పిల్లలు వాటిని విసిగిస్తూ ఉంటారు. షారోన్ అలా చేయదు. అవంటే జాలిగా ఉంటుంది. అందుకే తనంటే నాకు ఇష్టం."

సిబిల్ ఏమీ మాట్లాడకుండా ఉండిపోయింది.

"నాకు కాండిల్స్ నమలడం అంటే ఇష్టం," అంది కాసేపయ్యాక.

"ఎవరికి మాత్రం ఇష్టం కాదు, చెప్పు?" అన్నాడు యువకుడు కాళ్లని తడుపుకుంటూ. "వావ్! చల్లగా ఉన్నాయి." ఫ్లోట్‌ని కింద పడేసాడు. "ఒక్క క్షణం ఆగు, సిబిల్. కొంచెం ఆగుదాం."

సిబిల్‌కి నడుము లోతు వచ్చేవరకూ నీళ్లల్లో నడిచారు. అప్పుడా యువకుడు సిబిల్‌ని ఎత్తుకుని ఆ ఫ్లోట్ మీద బొక్కబోర్లా పడుకోబెట్టాడు.

"నువ్వు బేతింగ్ కాప్ పెట్టుకోవా ఎప్పుడూ?" అని అడిగాడు.

"వదిలేయకు," అంది ఆదేశిస్తున్నట్టుగా. "గట్టిగా పట్టుకో."

"మిస్ కార్పెంటర్, నేనేం చేయాలో నాకు తెలుసు," అన్నాడు యువకుడు. "బనానాఫిష్ ఏమైనా కనిపిస్తుందేమో చూస్తూండు. ఇవాళ బనానాఫిష్‌కి పర్‌ఫెక్ట్ రోజు."

"నాకేమీ కనిపించడం లేదు," అంది సిబిల్.

"అవి అంతే. వాటి అలవాట్లు చాలా వింతగా ఉంటాయి. చాలా వింతగా." ఫ్లోట్‌ని నెమ్మదిగా ముందుకి తోస్తూ ఉన్నాడు. నీటిమట్టం ఇంకా అతని ఛాతీ వరకూ రాలేదు. "చాలా విషాదకరమైన జీవితాలు వాటివి," అన్నాడు. "అవేం చేస్తుంటాయో తెలుసా, సిబిల్?"

సిబిల్ తల అడ్డంగా ఊపింది.

"అవి చాలా అరటిపళ్లున్న గుంటలోకి ఈదుకుంటూ వెళ్లిపోతాయి. వెళ్తున్నప్పుడు అవి చాలా మామూలుగా కనిపించే చేపలే. కానీ ఒక్కసారి లోపలికి వెళ్లాక, అవి పందుల్లాగా ప్రవర్తిస్తాయి. ఒక్కోసారి బనానా హోల్‌లోకి వెళ్లిన చేపలు డెబ్భైయెనిమిది అరటిపళ్లు తినడం కూడా తెలుసు నాకు." ఫ్లోట్‌నీ, దానిమీదున్న పాపనీ కొంచెం ముందుకి తోసాడు. "సహజంగానే, అన్ని పళ్లు తిన్నాక అవి చాలా లావైపోయి, ఆ రంధ్రంలోనుంచి బయటికి రాలేవు. అంటే పట్టవన్నమాట."

"మరీ ముందుకి తోయద్దు," అంది సిబిల్. "అప్పుడు ఏమవుతుంది?"

"ఏంటి అయ్యేది, ఎవరికి?"

"బనానాఫిష్‌కి."

"ఓ, అన్ని తిన్నాక బయటకి రాలేక వాటికేమవుతుందనా?"

"అవును," అంది సిబిల్.

"చెప్పాలంటే బాధేస్తుంది, సిబిల్. అవి చచ్చిపోతాయి."

"ఎందుకు?" అని అడిగింది.

"వాటికి బనానా ఫీవర్ వస్తుంది. అది ప్రమాదకరమైన జబ్బు."

"అదిగో, ఒక అల వస్తోంది."

"మనం దాన్ని పట్టించుకోవద్దు; వదిలేద్దాం. ఇద్దరు మొనగాళ్లం," అన్నాడు ఆ యువకుడు. అతను సిబిల్ కాలి చీలమండల్ని చేతిలోకి తీసుకొని పైకీ కిందకీ వత్తాడు. ఫ్లోట్ అల మీదుగా వెళ్లిపోయింది. దాంతో సిబిల్ తల తడిసిపోయింది కానీ, ఆమె అరిచిన అరుపులో మాత్రం ఆనందాతిశయం.

ఫ్లోట్ మళ్లీ మామూలుగా అయిపోయాక, తడిసిన జుట్టుని వెనక్కి తోసుకుంటూ"ఇప్పుడే ఒకటి చూసాను," అంది.

"ఏం చూసావు, పాపా?"

"ఒక బనానాఫిష్‌ని."

"మై గాడ్! దాని నోట్లో అరటిపళ్లు ఉన్నాయా?" అని అడిగాడు.

"ఉన్నాయి. ఆరు," అంది సిబిల్.

ఆ ఫ్లోట్ అంచు దాటి వేలాడుతున్న పాప తడిపాదాన్ని కొంచెం పైకి లేపి హఠాత్తుగా ఆ యువకుడు దాన్ని ముద్దుపెట్టుకున్నాడు.
"హేయ్..." అంది ఆ పాదం తాలూకు యజమాని.
"ఇక మనం వెళ్లిపోదాం. ఇక చాలా?"
"లేదు."
"సారీ, ఇక వెళ్దాం," అనేసి అతను ఆ ఫ్లోట్‌ని ఒడ్డు వైపు తోసుకుంటూ వచ్చాడు. సిబిల్ దిగిపోయింది. మిగతా దూరమంతా దాన్ని అతనే మోసుకుంటూ వచ్చాడు.
"గుడ్‌బై," అని చెప్పేసి, సిబిల్ పరుగెత్తుకుంటూ హోటల్ వైపు వెళ్లిపోయింది, నిష్పూచీగా.

•

యువకుడు తన రోబ్ వేసుకుని, దాన్ని బిగించి కట్టుకుని, టవల్‌ని జేబులో పెట్టుకున్నాడు. తడిగా ఉన్న ఫ్లోట్‌ని చంకలో పెట్టుకున్నాడు. మెత్తగా, వేడిగా ఉన్న ఇసక మీద ఒంటరిగా నడుచుకుంటూ హోటల్ వైపు దారితీసాడు.
తడిగా ఉన్నవాళ్ల కోసం ఆ హోటల్ వారు కేటాయించిన ప్రత్యేకమైన లిఫ్ట్‌లోకి ఆ యువకుడితో బాటు, ముక్కు మీద ఆయింట్‌మెంట్ రాసుకుని ఉన్న ఒక మహిళ కూడా ప్రవేశించింది.
లిఫ్ట్ పైకి వెళ్లడం మొదలయ్యాక, "మీరు నా పాదాల వైపు చూస్తున్నారు," అన్నాడతను ఆమెతో.
"అర్థం కాలేదు. ఏంటీ?" అంది ఆ మహిళ.
"మీరు నా పాదాలవైపు చూస్తున్నారని అన్నాను."
"అదేమీ లేదు. నేను ఫ్లోర్ వైపు చూస్తున్నాను," అని ఆమె లిఫ్ట్ తలుపుల వైపుకి తిరిగింది.
"నా పాదాలు చూడాలనుంటే ఆ మాట చెప్పండి. అంతేకానీ, అలా దొంగచూపులు చూడొద్దు," అన్నాడతను.
"నేను దిగిపోతాను, ప్లీజ్," అంది ఆ మహిళ ఆ లిఫ్ట్‌ని ఆపరేట్ చేస్తున్న అమ్మాయితో.
లిఫ్ట్ తలుపు తెరుచుకోగానే వెనక్కి తిరిగి కూడా చూడకుండా ఆ మహిళ వెళ్లిపోయింది.
"నాకున్నవీ అందరిలాగే రెండు మామూలు పాదాలు. ఎవరైనా వాటివైపు నిక్కినిక్కి ఎందుకు చూడాలో నాకు అర్థం కాదు. ఐదో ఫ్లోర్," అన్నాడు. రూమ్ తాళంచెవిని జేబులోనుంచి తీసి పట్టుకున్నాడు.
ఐదో ఫ్లోర్‌లో దిగిపోయి, హాల్‌లో నడుచుకుంటూ వెళ్లి రూమ్ నంబర్ 507 లోకి ప్రవేశించాడు. రూమ్‌లో వాసన– తోలు సూట్‌కేస్‌ల తోలు వాసన, గోళ్ల రంగు వాసన.
ఆ జంటమంచాల మీద పడుకుని ఉన్న అమ్మాయి వైపు ఒకసారి చూసాడు. తరువాత ఒక సూట్‌కేస్ దగ్గరకి వెళ్లి, దాన్ని ఓపెన్ చేసి, అందులో లోదుస్తుల కింద ఉన్న 7.65 కాలిబర్ ఆటోమాటిక్ పిస్టల్‌ని బయటకి తీసాడు. పిస్టల్ మాగజీన్ ఒకసారి రిలీజ్ చేసి, పరీక్షించి, మళ్లీ పెట్టాడు. దాన్ని ఉపయోగించడానికి వీలుగా ఉండేలా పట్టుకున్నాడు. తరువాత, మంచానికి మరోవైపు వెళ్లి కూచుని, అమ్మాయి వైపు ఒకసారి చూసి, పిస్టల్ గురిచూసుకుని, ఒక బులెట్‌ని పేల్చుకున్నాడు తన కుడి కణతలోకి.

★